ఇరుసు

చివుకుల సీతారామబాబు



అతన్ని ఇందాకటినుండీ గమనిస్తున్నాను.

ప్లాట్‌ఫారంమీద తిరుగాడుతున్న ప్రతి వ్యక్తినీ పట్టిపట్టి చూస్తున్నాడు, వాళ్ళ ముఖ భావాలని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లుగా ఉన్నాయి అతని చూపులు.

నాకు చాలా దగ్గరలోనే ఉన్నాడు.

చేతిలో సంచీ ఖరీదయిన గుడ్డల్లోనే ఉన్నాడు. వయస్సు పాతిక దాటిఉంటాయి.

అతని పరిశీలనలో మాకు కొద్దిదూరంలో కూర్చునిఉన్న యాభైఏళ్ళ ముసలాయన — ఇరవైఅయిదేళ్ల వయస్సుగల స్త్రీ కూడా ఉన్నారు. ముసలాయన ఆ అమ్మాయితో కన్నడంలో ఏదో చెబుతున్నాడు. ఆ అమ్మాయి తల వంచుకుని మౌనంగా ఆయన మాటలను వింటున్నది. ఆయన ముఖంలో ఏదో బాధ ప్రస్ఫుటమవుతుంది. ఆమెకేదో వచ్చచెప్పాలని ప్రయత్నిస్తున్నట్లుగా తోచింది నాకు.

ప్లాట్‌ఫారం అంతా రద్దీగాఉంది. అదృష్టవశాత్తు మా చుట్టు ప్రక్కల అంతగా జనంలేరు—స్టేషన్ అంతా ఏదోగోల. అవతల ప్లాట్‌ఫారం మీద ఏదోబండి వచ్చి ఆగినట్లుంది. ఇంజను పెద్దగా కూత పెడుతుంది.

అతను నాకేసి చాలాసార్లు చూశాడు. అలా చూడటంతో మా ఇద్దరి కళ్ళు కొన్ని క్షణాలపాటు కలుసుకున్నాయి. ఆ పరిచయం ఆసరాగా అతన్ని పలకరించాలని బుద్ధి పుట్టింది.

"ఏ ఊరు వెళ్ళాలి ?" అడిగాను అతన్ని చూసి నవ్వుతూ.

"కాజీపేట" అతనూ నవ్వుతూనే చెప్పాడు.

ఆ సమయంలో అతని కళ్ళు నన్నే పరీక్షగా చూస్తున్నాయని, నన్నేదో చదవాలని తాపత్రయ పడుతున్నాయని నాకు తెలుస్తూనే ఉంది.

అంతకుముందే కొన్న నా చేతిలోని వార పత్రిక చూస్తూ అన్నాడతను — "మీరు పుస్తకాలు బాగా చదువుతారా ?"

తల ఊపాను.

"ప్రస్తుతం వచ్చే రచనల్లో మీరు ఏ రచయితని ఇష్టపడతారు ?"

అతను ఆ ప్రశ్నవేయటంలో చాలా ఊహ చేశాడని అన్పించింది. నా ఉద్దేశ్యం ప్రకారం ఆ ప్రశ్నకు నేను ఇచ్చే సమాధానాన్ని బట్టి సాహిత్యరంగంలో నాకు గల విరికను తెలుసుకునే ప్రయత్నంలో వున్నాడు.

కొంతమంది పేర్లు చెప్పాను.

అతను ఆశ్చర్యపోయాడు నా జవాబువిని. నేను చెప్పిన పేర్లన్నీ సంఘంలో రచయితగా బాగా గుర్తింపబడినవాళ్ళవే.

"ఫర్వాలేదు. మంచివాళ్ళ పేర్లే చెప్పారు. అంటే మీరు బాగా చదువుతారన్న మాట పుస్తకాలు" అన్నాడు.

అతను అలా అనటాన్ని బట్టి నానోటి మీదుగా అలాంటి వాళ్ళపేర్లని ఊహించలేదని నాకనిపించింది! పైగా నన్నుగురించి అతను తక్కువగా అంచనా వేశాడనిపించింది కూడా.

"నేను కథలు రాస్తుంటాను" అన్నాడతను కొంతసేపు ఆగి.

అలా అంటుంటే అతని కళ్ళు గర్వంగా మెరిశాయి. కథ రాయటం అనేది ఈనాటి జీవితంలో అత్యున్నతమయిన గొప్పదనంగా అతను భావిస్తున్నట్టు అన్పించింది.

"అలాగా" అన్నాను మామూలుగా.

బహుశా అతని మాటలు విని ఆశ్చర్య పోతానని అతను అనుకుని ఉండాలి—నాలో అలాంటి భావం ఏదీ వ్యక్తం కాకపోవటంతో కొంత ఆశాభంగం చెందినట్టుగా కనిపించాడు కానీ అంతలోనే మళ్ళీ మామూలుగా అయిపోతూ—

"రెండు కథలు ప్రచురితమయినాయి కూడా" అన్నాడు. నవ్వొచ్చిందినాకు;

అతన్ని చూస్తుంటే కాదు. అతనిమాటలకు, వాటివెనుక తొంగి చూస్తున్న భావానికి మాత్రమే.

"ఈమధ్య బొత్తిగా సాహిత్యరంగం చెడిపోయినది. అడ్డమైన వాళ్ళు కథలు రాసేస్తున్నారు" అన్నాను.

నామాటలకు అతను ఉలిక్కిపడ్డాడు.

నా నుంచి సాహిత్య రంగంమీద అంత ఘాటైన కాంప్లిమెంట్ వస్తుందని అతను ఊహించి ఉండడు. పైగా నా మాటలు అతన్ని ఉద్దేశించి అన్నట్టుగా అతను ఫీలయ్యాడనిపించింది.

"బాగా రాయగలవాళ్ళు ఎప్పుడూ బాగానే రాస్తారు. రాయలేనివాళ్ళు ఎన్ని అవకాశాలున్నా కూడా రాయలేరు. అలాగని అందర్నీ ఒక కట్టగా కట్టలేము" అన్నాను మళ్ళీ.

నా మాటలతో అతను కొంత రికవర్ అయ్యాడు.

"నిజమే మీరు చెప్పింది. రచయిత అనేవాడికి పరిశీలనా దృష్టి చాలా ఎక్కువగా ఉండాలి. అది లేనప్పుడు అతని రచనలో వాస్తవికత లోపిస్తుంది. ఏమంటారు?" అన్నాడు అతను.

అలా అంటున్నప్పుడు కూడా అతని కళ్ళల్లో గర్వ భావం తొంగి చూస్తూనే ఉన్నది. ఒక రచనలోని వాస్తవికతను తాను కనుగొని బయట పెడుతున్నట్టు అతను ఫీలవుతున్నాడేకాని, ఆ మాటలు యధాలాపంగా అంటున్నట్టు లేదు.

"నిజమేనేమో!"

"రచయిత సమాజానికి టానిక్ వంటివాడు. సమాజానికి ఏమేం కావాలో తెలుసుకుని అందివ్వగలిగే సామర్థ్యం ఉండాలి. సమాజం పట్ల ఎంతో మెలకువగా వ్యవహరించాలి. తన చుట్టూ ఉండే ప్రతి వ్యక్తినీ ప్రతి వస్తువునీ ఎంతో పరిశీలనాత్మకంగా చూడగలగాలి. ప్రతి చిన్న విషయాన్నీ కూడా సాకల్యంగా అవగాహన చేసుకోవాలి" ఆవేశం కూడిన స్వరంతో చెబుతున్నాడు అతను. నేనేం మాట్లాడలేదు.

"అదే మామూలు వాళ్లకు మాకు ఉన్న తేడా. మీలాంటి సాధారణ వ్యక్తులు ఏ విషయాన్నైనా ఒక దృక్కోణం నుండి మాత్రమే చూడగలుగుతారు. ఎదుటివాడు ఎలాంటి పరిస్థితిలో ఉన్నాడో మీరు ఆలోచించలేరు. కాని రచయితకు అది సాధ్యం. ఎందుకంటే అతను ఏ విషయాన్నైనా వివిధ దృక్కోణాలనుండి చూడగలడుకాబట్టి"

అతని మాటల్లో అతిశయం ఎక్కువగా ఉన్నది. రచయితని అని చెప్పుకోటంవల్ల తనకుతాను ఓ 'సుపీరియారిటీ'ని ఆపాదించుకుంటున్నాడు. అలా ఆపాదించుకోవటం వల్ల కొంత తృప్తినీ, గర్వాన్నీ అతను పొందుతున్నాడు.

ఆ తర్వాత కొంతసేపు అతనేం అనలేదు.

"వాళ్ళని చూస్తున్నారా?" అన్నాడు అతను కొంతసేపటి తర్వాత. అతను చెబుతున్నది కన్నడం మాట్లాడు తున్న ముసలాయన ఆ అమ్మాయిలగురించి.

"ఆ" అన్నాను—

"నిజానికి వాళ్ల భాష ఏమిటో నాకుతెలీదు. ఇప్పటికి అరగంటనుండీ వాళ్ళు మాట్లాడుకుంటూనే ఉన్నా ఒకముక్క కూడా నేను అర్థం చేసుకోలేకపోయాను కానీ..."

ఇంతలో ఎవరో వచ్చి అగ్గిపెట్టె అడగటంతో ఆగిపోయాడు అతను. అగ్గిపెట్టె ఇచ్చి ఆ వ్యక్తి సిగిరెట్టు కాల్చుకునేదాకా ఆగి అగ్గిపెట్టె జేబులో వేసుకుంటూ తిరిగి చెప్పనారంభించాడు.

..."కాని వాళ్ళిద్దరు ఏంతటి పరిస్థితిలో ఉన్నారు — అనేది నేను ఊహించగలను. నా ఊహ ఏమాత్రం తప్పుకాదుకూడా" స్థిరంగా అన్నాడు అతను.

ఆ మాటల వెనుక తన పట్ల తనకుగల తీవ్రమైన నమ్మకం వ్యక్తమవుతుంది. దానితోపాటుగా అలాంటి ప్రజ్ఞ అతనికి ఉన్నందుకు అతను కొంత గర్వపడుతున్నట్లుగా ఉంది.

"ఎలాంటి కండిషన్‌లో ఉన్నారంటారు?" కుతూహలంగా అడిగాను.

నవ్వాడతడు చిన్నగా.

సిగిరెట్టు వెలిగించి పొగ వదులుతూ—

"వాళ్ల వయస్సులు — మాట్లాడుకునే తీరు — ముఖభావాలు — వీటినిబట్టి వాళ్ళు మూడు రకాలు అయిన పరిస్థితుల్లో ఉండవచ్చును. అంతే."

"ఏమిటవి?"

అతను గట్టిగా పొగపీల్చి రింగులుగా వదులుతూ చెప్పటం మొదలుపెట్టాడు.

"మొదటిది — వాళ్ళిద్దరు తండ్రీ కూతుళ్ళు అయిఉంటారు. ఆమెను ఆ ముసలాయన పుట్టింటికి తీసుకుపోతున్నాడు. ముఖ భావాలనిబట్టి ఆయన ఏదో బాధపడుతున్నట్టుగా తోస్తున్నది. కనుక ఇంటిదగ్గర ఎవరన్నా ప్రమాద పరిస్థితిలో ఉండి ఉంటారు. అంటే అతని భార్య కావచ్చు. లేక కొడుకు కావచ్చు ఆ ఇంటి సభ్యుల్లో ఎవరైనా సరే" అని ఆపాడు అతను.

నేను కుతూహలంగా వింటున్నాను.

సెప్టెంబరువరకు వాతావరణ సూచనలు

భారత వాతావరణ పరిశోధనశాఖ సూచనల ప్రకారం మనదేశ వాయవ్య ప్రాంతంలో లోనూ, దక్షిణ ద్వీప కల్పంలోనూ 1977 జూన్ నుండి సెప్టెంబరు వరకు మామూలు వర్షాలు కురుస్తాయి.

ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో గత వాతావరణ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని జూన్— సెప్టెంబరు కాలంలో కురిసే వర్షాలను చాలా ముందుగానే పసిగట్టే స్థితిలో మనం ఉన్నాము. ఈ అంచనాలు 80 శాతం విజయవంతమైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని చేయబడ్డాయి.

మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, తెలంగాణా, లోతట్టు కర్నాటక (ఉత్తర) కోస్తా ఆంధ్ర, కోస్తా కర్నాటక (దక్షిణకవరా మినహాయించి) లలో 1977 జూన్ నుండి సెప్టెంబరు వరకు సాధారణంగా కురిసే వర్షంలో 97 శాతం కురుస్తుంది. జమ్ము మరియు కాశ్మీర్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబు, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ చండీఘర్, రాజస్థాన్‌లలో 1977 జూన్ నుండి సెప్టెంబరు వరకు సాధారణంగాకురిసే వర్షం ప్రకారం 106 శాతం కురుస్తుంది.

"ఇక రెండో విధంగా చెప్పాలంటే అతను ఆ అమ్మాయికి మామగారు. ఆ అమ్మాయిని వాళ్ళ పుట్టింటినుండి తమ ఊరికి తీసుకు పోతున్నాడు అలా జరగటం మామూలుగా జరిగే పనే అయితే ఆయన అంతగా ఆందోళన చెందనవసరం లేదు. కాబట్టి ఇంటి దగ్గర ఎవరో ప్రమాద స్థితిలో ఉన్నారు. అంటే ఆ అమ్మాయి భర్త లేక అత్తగారు ఎవరయినా సరే ఆ ఇంట్లో. ఆ అమ్మాయిని తీసుకువచ్చేవాళ్ళు వేరెవరూ లేకపోవటంవల్ల ఆయన స్వయంగా బయలుదేరక తప్పలేదు. కోడలిని తీసుకువచ్చేటందుకు" చెప్పటం ఆపాడు అతడు.

బండి నెమ్మదిస్తోంది. ప్రయాణీకులు అందరూ లేచి నిలబడ్డారు. సామాన్లు సర్దుకుంటున్న హడావుడి.

"మూడో పరిస్థితి?" అడిగాడు.

"చెబుతున్నాను— ఆ అమ్మాయికి ఆ ముసలాయన తండ్రి కాదు, మామగారుకాదు అన్నగారు కావటానికి వీలులేదు. ఎందుకంటే వయస్సు ఇద్దరి మధ్యా చాలా తేడా ఉంది. ఆమెం కలిసి ప్రయాణం చేయటంలో అర్థం ఆమె వెంట ఎక్కడికో పెద్ద దిక్కుగా బయలుదేరాడన్న మాట ప్రయాణంలో. అలాంటి నమ్మకమూ చనువు ఉన్నాయంటే తప్పకుండా ఆయన ఆ అమ్మాయి తరఫు బంధువో లేక వాళ్ళ నాన్న గారి స్నేహితుడో అయి ఉంటారు. కూడా తోడుగావచ్చిన పెద్దమనిషి ఏదో విషయాన్ని గురించి బాధగా చెబుతున్నాడంటే కారణం ఏమై ఉంటుంది. తప్పకుండా అతని ఇంటి విషయాలే. అబ్బాయి ఉద్యోగం గురించో అమ్మాయి పెళ్ళి గురించో లేక వాళ్ళ గృహ సంబంధమయిన ఒక విషయాన్ని గురించి చెప్పి బాధ పడుతున్నాడు.

ఇంకా ఎన్నో రకాల పరిస్థితులలో వాళ్ళు ఉన్నట్లుగా ఊహించుకోవచ్చు కానీ ఎక్కువ బలంగా నిలిచే పరిస్థితులు ఈ మూడే" అంటూ ముగించాడు అతను.

అప్పటికే బండి ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చింది. అతను ఎక్కాల్సిన బండి అదే. అందుకని అతను క్రింద ఉంచిన సంచీని చేతిలోకి అందుకుని—

"నేను వెళ్ళాల్సిన బండి ఇదే. రండి అక్కడనుంచుందాము" అన్నాడు.

కిటికీ లోనుంచి లోపలి సీటులో సంచీ ఉంచి నాకేసితిరిగాడు.

"ఎలా ఉంది నా ఊహ?" అన్నాడు.

"బాగానే ఉంది" అన్నాను.

గర్వంగా నవ్వాడు అతను.

"నా ఊహ ఎప్పుడూ తప్పు అవదు. ఎంతగా ఆలోచించినా ఇంతకంటే బలమైన పరిస్థితి వాళ్ళకు ఉన్నట్టు తోచదుకదూ?"

గార్డు విజిల్ ఊదాడు.

"అప్పట్నుంచి మీకు ఓ విషయం చెప్పటం మరిచిపోయాను" అన్నాను.

"ఏమిటి?" అడిగాను అతను.

"వాళ్ళు మాట్లాడు కుంటున్న భాష కన్నడం. అదినాకుతెలుసు" అతను ఆశ్చర్యంగా నాకేసి చూశాడు.

తను ఊహించిన మూడు పరిస్థితులలో ఏ పరిస్థితిలోనయినా వాళ్ళు ఉన్నారా అనే కుతూహలం అతని కళ్ళల్లో మెదలటం గమనించాను నేను.

"మీకోవిషయంచెప్పవలసి వస్తున్నందుకు బాధగా ఉంది" అన్నాను తర్వాత. అతను ఏదో దెబ్బతిన్నట్టుగా చూశాడు నాకేసి.

"అవును— మీరు చెప్పిన మూడు పరిస్థితులలోనూ వాళ్ళులేరు. మీరు రచయిత కావచ్చు. కాని ఊహలు జీవితాలతో ఎప్పుడూ సరిపోవు. రచయితకు వివిధ దృక్కోణాల నుంచీ పరిశీలించగల సామర్థ్యం, ఉండాలి అంటూనే మీరూ ఒకే కోణంలోనుంచి చూశారు వాళ్ళని. మీరు చూసిన కోణం ఆముసలాయన వైపేఉంది. ఆ అమ్మాయి ముఖభావాలు మీరుపట్టించు కున్నట్టు లేదు."

అతను బిత్తరపోయి చూస్తున్నాడు నాకేసి.

'ఆ అమ్మాయి ముసలయన కూతురే. ఆ అమ్మాయి పెళ్ళిఅయి సంవత్సరంన్నర దాటింది. ఈమధ్య కాలంలో ఆమెభర్త ఆమెను సరిగా చూడలేదు. అతను పెట్టే బాధలు భరించలేని ఆమె పుట్టింటికి తిరిగి వచ్చింది వారం క్రితం కానీ ఎంత అయినా తండ్రి ప్రాణం కదా? కూతురు కాపురం ఎక్కడ పాడవుతుందోనని ఆయన బాధ. అందుకనే ఆ అమ్మాయికి ఎన్నోవిధాల నచ్చ చెప్పి భర్తదగ్గరకు మళ్ళీ తీసుకుపోతున్నాడు. మళ్ళీ భర్తదగ్గరికి వెళ్ళి ఆ నరకంలో తాను పడటం ఆమెకు ఇష్టం లేదు. అందుకనే ముభావంగా కూర్చుని ఉంది. ఆ ముసలాయన ఇందాకటినుంచీ చెబుతున్నది — అక్కడికి వెళ్ళినతర్వాత భర్తతో ఎలా మసలాలి? అనే విషయం, భర్తలేని స్త్రీని సమాజం ఎలా చూస్తుంది అనే అంశం."

రైలు బయలుదేరింది.

అతని ముఖాన నెత్తురుచుక్క లేదు.

అతనిమీద అతనికిగల నమ్మకానికి నా మాటలు పెద్ద దెబ్బ. అందుకనే అతనిలో అంత మార్పు. ఎందుకనో అతన్ని ఆ పరిస్థితిలో చూసిన తర్వాత ఒక్క క్షణంపాటు జాలికలిగింది.

అతను చిన్నగా నవ్వి — "అలాగా!" అన్నాడు.

అని అప్పుడే వేగం అందుకుంటున్న రైలులోకి ఎక్కాడు 'వస్తానంటూ —' ఆ క్షణంలో అతని ముఖంలో ఎన్నో భావాలు చదవగలిగాను నేను. తప్పుచేసి పట్టుబడిన వాడిలా చిన్నబోయింది అతని ముఖం. నవ్వలేక నవ్వాడు అంతే.

రైలు వేగం అందుకుని చూస్తుండగానే కనుమరుగైంది.

తిరిగివచ్చి ఇందాకటి స్థలంలోనే నుంచున్నాను మళ్ళీ. ఆ ముసలాయన ఇంకా చెబుతూనే ఉన్నాడు కన్నడంలో ఆ అమ్మాయికి. ఆమె తల వంచుకుని వింటూనే వుంది.

ఆ ముసలాయన మాటలు వింటుంటే నాకు నవ్వు ఆగటంలేదు. అప్పుడుమరి ఆయన మాటల్లో ఒక్కముక్కకూడా నాకు అర్థం తెలీదు.

శిథిలం

— మురళీ ప్రభాకర్

మనిషిగా ఆశలు కొల్లలు
మనసుకా లేని పోని ఎల్లలు
మమతలూ బుణాలూ కొకొల్లలు
నిజానికివన్నీ ఎండమావులు, కల్లలు

ఇది నిత్యం జరిగే సృష్టి
ఏదీ లోపంలేని దృష్టి ?
ఒకడు నిత్య నికృష్టి,
ఒకడు నిరంతర కష్టి.

రేపేదో తెస్తుందన్న ఆశ
అది రాకపోతే నిరాశ
అక్షయమీ దురాశ
జీవితమొక అడియాస.